# నిమజ్జనం

రవి ఇంకా రాలేదేమిటి?

నేను కుర్చీలో అసహనంగా కదిలాను. చూస్తున్న ఫైలు నుంచి దృష్టి మళ్ళించాను. కళ్ళద్దాలు తీసి బల్ల మీద పెట్టి ఒకసారి కళ్ళు నులుపుకొని వాచీ చూసాను.

పండెండు గంటలు దాటిపోయాయి.

బొంబాయి నుంచి వచ్చే విమానం ఒక గంట క్రితమే వచ్చి వుండాలి. మరి, రవి...

ఇంటికి వెళ్ళి వుంటాడా!

ఛీ! ఛీ! రవి అలా వెళ్ళడు. చెయ్యవలసిన పని, చెయ్యవలసిన సమయంలో చేసి వివరాలు యాజమాన్యానికి తెలియబరిచే వరకూ రవి దృష్టి పనిమీదే వుంటుంది. ఇంకో ఆలోచన రాదు. ఈ సంగతి నాకే కాదు, మా ఆఫీసులో పనిచేసే ప్రతీ ఒక్కరికీ తెలుసు.

మరి యేమయింది?

బొంబాయి నుంచి బయలు దేరలేదా?

పొద్దున్నే మా ఎమ్.డీ ఫోన్ చేసినప్పుడు రవి ఉదయం విమానంలో బయలు దేరుతున్నాడని, అతను వచ్చాక వివరాలన్నీ చెప్తాడని చెప్పారు కదా?

కార్మికులకు సంబంధించిన వేతన సవరింపులు గురించిన వివరాలు తెస్తున్నాడని, అవి కార్మికుల నాయకులకు వివరించి ఒప్పందం మీద సంతకాలు చేయించాలనీ కూడా అన్నారు కదా.

మరి యితనూ...

నేను కూర్చోలేకపోయాను. మెల్లిగా లేచి గదిలో అటు, ఇటు నడిచాను. కిటికీ దగ్గరకు వెళ్ళి తెర తొలగించి చూసాను - రవి కారేమయినా కనబడుతుందేమోనని.

రోడ్డు మీద బస్సుగానీ, ఆటోగానీ కనబడలేదు. ఆ రోజు గణేష్ నిమజ్జనం అనేది హఠాత్తుగా గుర్తుకొచ్చింది నాకు.

అందరికీ ఆ రోజు సెలవే! ముఖ్యమైన పనులుండటం వల్ల ఆఫీసుకి సెలవయినా వచ్చాను. నేను, ఎమ్.డీని కలిసి వచ్చే రవితో, మాట్లాడాలి. కానీ వాడు రాలేదేమిటి?

నా ఓర్పు నశించింది. పోకెట్ నుంచి పైపు తీసి పొగాకు వేసి అంటించాను. పొగ పీల్చి వదిలి మళ్ళీ రోడ్డు వైపు చూసాను.

ఆ రోజు వరకు ఆకాశపు అంచులో ఎక్కడో పడి అణిగి, మణిగి వున్న నల్లని మబ్బు ఆకాశాన్ని తన గుప్పెటలోకి తీసుకొన్నట్లు వుంది. ఉండి, ఉండి పడుతున్న వాన చినుకు కొత్తగా అధికారంలోకి వచ్చిన ఆఫీసర్, పనివాళ్ళని తన వశం చేసుకోవటానికోసం యిచ్చే చిరు సడలింపుల్లా వున్నాయి.

కిటికీ తలుపులు వేసి వున్నా దూరం నుంచి హోరుగాలిలా నిమజ్జన గోల వినబడుతోంది. చిన్నా, పెద్దా వినాయక విగ్రహాలని నిమజ్జనం కోసం హుస్సేన్ సాగర్ వైపు ఆర్భాటంగా వూరేగింపుతో తెస్తున్నారు.

రవి కారేమయినా ఈ వూరేగింపులో చిక్కుకుపోయిందా? అలా అయితే ఫోన్ చెయ్యాలి కదా?

ఫోన్ చెయ్యకుండా, బాధ్యతారహితంగా వుండేవాడు కాదు, రవి.

ప్రప్రథమంగా రవి ఆఫీసు పని గురించి బొంబాయి వెళ్ళి తిరిగి వచ్చిన రోజు హైదరాబాద్ బంద్. ఆరోజు డ్రైవర్ విమానాశ్రమయంలోనికి వెళ్ళలేక పోయాడు. అయినా నానాపాట్లూ పడి, కొంత నడిచి తిన్నగా ఆఫీసుకే వచ్చేడు, రవి.

నా బుర్ర వేడెక్కింది. ఏ.సి. వేగం పెంచి వేగంగా గదిలో అటూ, యిటూ నడిచాను. గబగబా రెండు మూడుసార్లు పొగ పీల్చాను.

సరిగ్గా తొమ్మిది సంవత్సరాల క్రితం చవితినాడే రవిని మొదటిసారిగా కలిసాను.

"ఏమండోయ్, ఆఫీసు లేకపోతే పోయె. పూజ అయిపోయిందిగా" - మా ఆవిడ అంది - "ఒంటిమీద ఒక చొక్కా వేసుకొని కూర్చోండి, చొక్కా లేకుండా, కదలకుండా అలా కూర్చుంటే మీరే వినాయకుడు అనుకుంటారు, ఎవరయినా వస్తే"

"నేను వినాయకుడినే కదే? వినాయకరావు"- నేను నవ్వుతూ అన్నాను - "ఐనా ఎవరు వస్తారులే చవితి పూట"

నేను ఆ మాట పూర్తి చెయ్యకముందే బెల్లు మోగింది. లేచివెళ్ళి తలుపు తీసాను.

మబ్బు తునకలని వెనక్కు తోసి ముందుకు వచ్చే బాల సూర్యుని లాంటి కుర్రవాడొకడు తలుపు కవతల నిలబడి వున్నాడు. పసితనము, యవ్వనమూ కలిసే సంధ్యారాగ ఛాయలు, అతని మోము మీద అందమయిన రేఖలు గీస్తున్నాయి.

"నేను రవినండీ" అతను అన్నాడు – "మీ ఫేక్టరీలో పనిచేస్తున్నానండీ".

నేను ఆ మాటలు పట్టించుకోలేదు.

"నేను కోటేశ్వరరావుగారి అబ్బాయినండీ" – వాడు మళ్ళీ అన్నాడు.

అయితే, ఏమిటి, అన్నట్టు నిర్లక్ష్యంగా చూసాను, అతని వైపు.

"మా నాన్నగారు మిమ్మల్ని కలవమన్నారండీ, మీరు ఆయనకి ఫ్రెండట కదా!"

ఆ మాటలూ నా కలవాటే! రోజుకో పదిసార్లయినా ఆ మాటలు వింటూ వుంటాను. ప్రముఖ పరిశ్రమకు మానవ వనరుల శాఖాధికారిగా పనిచేస్తున్న నేను అలాంటి మాటలు పట్టించుకోకూడదు. రెండడుగులు వెనక్కు వేసాను, తలుపు మీద చెయ్యి వేసాను. ఉదయ సూర్యుని మోము మీదకి పాకిన నల్లమబ్బు తునకలా వాడి మోము మీదకి విషాద ఛాయ పాకింది.

"మా నాన్నని మీరు గుర్తించినట్టు లేదండీ" వాడు అన్నాడు – "మాది ఇర్రిపాకండి".

ఇర్రిపాక అనగానే బుర్ర వెలిగింది.

ఇర్రిపాక మా వూరే! ఇర్రిపాక కోటేశ్వరరావు అంటే...

"ఒరేయ్ నువ్వు మా కోటిగాడి కొడుకు వేమిటిరా!" – నేను ఆనందాశ్చర్యాలతో అడిగాను – "మరి ఆ మాట చెప్పవేమిటిరా!"

హఠాత్తుగా వాడి మీద నాకు అభిమానమూ, ఆప్యాయతా వుప్పొంగాయి.

"రా, రా లోనికిరా ఎలా వున్నాడు, మా కోటిగాడు!"

నా వెనుక అడుగు మీద అడుగు వేసి లోనికి వచ్చాడు రవి.

సోఫాలో కూర్చుని రవిని ఆపాదమస్తకమూ ఓసారి చూసాను. కోటిగాడి పోలికలు వాడిలో కొట్టొచ్చినట్లు కనబడతున్నాయి.

"కూర్చోరా"

వాడు కూర్చోలేదు. వినయ విధేయతలతో నిలబడ్డాడు. కూర్చోమని మరీ బలవంతం చేస్తే అన్నాడు – "ఒద్దు సార్, దేవుడితో సమానంగా కూర్చోకూడదు సార్".

అమాయకుడిగా కనపడినా కుర్రవాడు మాటకారే అనుకున్నాను, మా డిపార్ట్ మెంటుకి బాగా పనికివస్తాడు.

"ఫేక్టరీలో ఏం చేస్తున్నావ్?"

"ప్రొడక్షన్‌లో స్టెనోగా చేస్తున్నాను, సార్".

"బాగుంది పండుగ పూట వచ్చావ్, దేవునికి దండం పెట్టి ప్రసాదం తీసుకో"

హఠాత్తుగా వాడు నా కాళ్ళమీద పడిపోయాడు.

"ఏమిటి! ఇదేమిటి?" నేను కంగారుగా అడిగేను.

"దేవునికి దండం పెట్టమని మీరేగదండీ అన్నారు"

చాలా యిబ్బంది కలిగింది నాకు.

"ప్రసాదం యివ్వండి సార్" - రవి లేస్తూ అన్నాడు.

"మీరు పెద్దలు - మా లాంటి సగటు ఉద్యోగులకు వరాలిచ్చే దేవుళ్ళు మీరే కదండీ".

ఏమనాలో నాకు తోచలేదు. కానీ రవి మాటకారితనాన్ని మనస్సులో మెచ్చుకోకుండా వుండలేకపోయాను. మంచి శిల్పిచేతిలో పడితే అందరి దృష్టినీ ఆకట్టుకునే అందమయిన బొమ్మగా మారగల ముడిసరకు రవి అని అనుకున్నాను.

ప్రసాదం తీసికొని వెళ్ళిపోయాడు రవి. మళ్ళీ వచ్చాడు ఆదివారం. ఆ ఆదివారమే కాదు మరో ఆదివారం కూడా. క్రమేపీ రవి మోగించిన కాలింగ్‌బెల్‌తోనే మాకు ఆదివారాలు తెల్లవారేవి.

మరోసారి కిటికీనుంచి రోడ్డువైపు చూసాను. నిమజ్జనపు వూరేగింపు. కొంత దగ్గరలో కనబడింది. విగ్రహాల మొహాలే కావు, విగ్రహాలని ముంచేవారి మొహాలు కూడా కొంత స్పష్టంగా గోచరిస్తున్నాయి.

"నేనింకా చదవాలని అనుకుంటున్నాను సార్" - ఒక ఆదివారం రవి అన్నాడు.

నాకు చాలా ఆనందం కలిగింది చేస్తున్న ఉద్యోగంలోనే, బల్లిలా అతుక్కుపోయి, నాకింకేమిటిలే అని అనుకోకుండా పై చదువులు చదివి విజ్ఞానం పెంచుకోవాలని అనుకునే వాళ్ళంటే నా కిష్టం.

"ఏం చదవాలని అనుకుంటున్నావ్?"

"మీలాగే సార్. పెర్సనల్ మేనేజ్‌మెంట్ గానీ..."

"ఏంటీ?"

"ఫ్యాక్టరీ నుంచి ఇంతదూరం వచ్చి చదవాలంటే..."

నాకర్థమయింది. రోజూ ఫ్యాక్టరీలో పనిచేస్తూ సిటీకి వచ్చి చదవటం చాలా కష్టం.

రవిని సిటీ ఆఫీసుకి బదిలిచేస్తే...

ఆలోచన వస్తే అమలు పరచకుండా వుండటం, మా వృత్తి లక్షణం కాదు. చెయ్యాలని అనుకున్నది చెయ్యటం, ఆ తర్వాత వచ్చే ప్రతిస్పందనని ఎదుర్కోవటం, సందర్భానుగుణంగా వివరణ యిచ్చి చేసిన పనిని సమర్థించుకోవటం మా వృత్తిలో వున్నవారికి వుండవలసిన ప్రాథమిక లక్షణాలు.

నిర్ణయాలు సంబంధిత వ్యక్తులను బట్టి తీసుకోకూడదని, సమస్యని కూలంకషంగా పరిశీలించి వ్యక్తి ప్రభావాలకు అతీతంగా తీసుకోవాలని నేను బోధించే మాటలని పక్కకి నెట్టేసాను. వాడు చదవాలనుకుంటున్నాడు. పైకి వస్తాడు. పైకి రాలేకపోతే పైకి తీసుకు రావాలి. ఎందుకంటే వాడు, మా కోటిగాడి కొడుకు!

బూడిదగా మారిన పొగాకుని దులిపి పైపులో కొత్త పొగాకు వేసుకొని మళ్ళీ రోడ్డు మీదకు దృష్టి సారించాను.

రోడ్డు మీద జనసమ్మర్థం పెరిగిపోయింది. నిమజ్జనం చూసి ఆనందించటానికి జనం డాబాల మీద కూడా నిలబడ్డారు. జనం ముంచేస్తారని తెలియని వినాయకులు భజన సంఘాల మేళతాళాలతో మురిసిపోయి ముందుకి సాగుతున్నారు.

తప్పు పట్టడానికి వీలులేకుండా పనిచేసే వాడు రవి. ఒకసారి చెప్తే విషయాన్ని యిట్టే పట్టుకొనేవాడు. అంతేకాదు, నా మీద ఈగని కూడా వాలనిచ్చేవాడు కాదు. ఆఫీసులో ఎవరన్నా నా ప్రవర్తనారీతుల గురించి విమర్శిస్తూ వుంటే వాళ్ళ మాటల్లో దూరిపోయి గొడవపడేవాడు. అలాంటి విమర్శలు నా దృష్టిలో మామూలేనని, వూరుకోమని చెప్తే వినేవాడు కాదు.

"ఎలా వూరుకుంటానండీ?" రవి అడిగేవాడు – "మీరు నాకు దేవుడు, మిమ్మల్ని అనటమా?"

నిజంగా నన్ను దేవుడిగానే చూసేవాడు రవి. ఆఫీసులోనూ, యింట్లోనూ నన్ను కాలు కింద పెట్టనిచ్చేవాడు కాదు. ఆఫీసు అయిపోయాక యింటికి వచ్చేవాడు. పిల్లలకి ట్యూషన్ చెప్పేవాడు. ఇంటికి అవసరమయిన సామానులు తెచ్చి పెట్టేవాడు. ఒద్దని దెబ్బలాడినా వినేవాడు కాదు. ఒకసారయితే అలాంటి పనులు మానకోపోతే మళ్ళీ ఫ్యాక్టరీకి బదిలీ చేస్తానని బెదిరించాను కూడా. అయినా, వినేవాడు కాదు.

"నేనెవర్నండీ – మీ కోటిగాడి కొడుకుని. మీకు సేవలు చెయ్యటం నా బాధ్యత"

ప్రతీసారి యివే మాటలతో నన్ను చిత్తు చేసేవాడు.

రెండు సంవత్సరాలు గడిచిపోయాయి. రవి నా ఆంజనేయుడనే పేరు సంపాదించుకున్నాడు. అంతేకాదు, పర్సనల్ మేనేజ్‌మెంట్ డిగ్రీ, మరియూ పర్సనల్ ఆఫీసర్ ప్రమోషన్ కూడా.

ప్రమోషన్ రాగానే నా కాళ్ళకు మరోసారి దండం పెట్టాడు. నేనే అతని దేవుడినని అభివర్ణించాడు. కనబడని దేవుడికి బదులు కొబ్బరికాయ నా పాదాల వద్ద కొట్టాలన్నాడు.

రవి అంటే నాకు అభిమానం పెరిగింది. నా పనులు కూడా చెయ్యగలిగే స్థాయికి ఎదిగాడు వాడు. అప్పుడప్పుడు ఎమ్.డీ. వద్దకు కూడా వెళ్ళి పనులు చేసుకొని వస్తున్నాడు. ఎమ్.డీ. కూడా అతన్ని మెచ్చుకోవటం నాకు చాలా ఆనందం కలిగించింది.

మరోసారి రోడ్డువైపు చూసాను, ఇసుక వేస్తే రాలనంత జనం వున్నారు, రోడ్డు మీద.

నిమజ్జన వూరేగింపు చాలా దగ్గరికి వచ్చేసింది.

రవి ఫ్యాక్టరీకిగానీ వెళ్ళి వుంటాడా?

ఫ్యాక్టరీకి ఫోన్ చేసాను. ఎవరూ ఫోన్ ఎత్తలేదు.

ఏం చెయ్యాలో తోచక బ్రీఫ్‌కేస్ తీసుకొని బయటకు వచ్చాను.

సెల్‌ఫోన్ మ్రోగింది.

“సీ మిస్టర్ రావ్” – మా ఎమ్.డీ. మాట్లాడారు – “కార్మికులతో ఒప్పందం అయిపోయింది. రవిని తిన్నగా ఫ్యాక్టరీకి వెళ్ళి ఆ పని చేసేయమని చెప్పాను. పని అయిపోయిందట! ఇప్పుడే ఫోన్ వచ్చింది. హి ఈజ్ ఎ క్లెవర్ బాయ్”

షాక్ తగిలినట్లయింది, నాకు. నేను లేకుండా, కార్మికులతో ఒప్పందమా!

“రవి సోమవారం వచ్చి అన్ని వివరాలు చెప్తాడు. బైదిబై మీరు మండే ఈవినింగ్ ఫ్లైట్‌కి బొంబాయి వచ్చేయండి”

“ఓ.కే. సార్”

“అలా వచ్చి వెళ్ళటానికి కాదు, మిమ్మల్ని బొంబాయి ఆఫీసుకి బదిలీ చేసాము.”

నా గుండెలో రాయి పడింది.

బొంబాయికి బదిలీ చేయటమంటే పరోక్షంగా ఉద్యోగం మానేసి వెళ్ళమని చెప్పటమే!

“ఛార్జి రవికి అప్పగించండి. అయినా పదిహేనేళ్ళ నుంచీ మిమ్మల్ని స్వతంత్రంగా ఒదలటం, నాదే తప్పు. అడిగేవాళ్ళు లేరనే ధీమాతో ఎన్నెన్ని పనులు చేసారు? అన్ని వివరాలు రవి చెప్పాడులెండి”.

ఎమ్.డి. ఫోన్ పెట్టేసారు. నాకు కాళ్ళూ, చేతులూ ఆడలేదు. రవి నా గురించి ఏమి చెప్పి వుంటాడు!

“ఈ నిమజ్జనం ఏమిటిరా?” – నా పక్కన నిలబడ్డ ఒకతన్ని అడిగేను – “తొమ్మిది రోజులు పూజచేసి చివరికి వరాలిచ్చే దేవుడిని ముంచటమేమిటిరా?”

"అదేరా మానవుల అలవాటు" - మరో అతను అన్నాడు.

"ఎవరైనా నీకు భజన చేస్తున్నారంటే వాడు నిన్ను ముంచుతాడన్నమాట"

'నిజమే! మానవుల భజన నించి దేవుడే తప్పించుకోలేనప్పుడు నాలాంటి మానవులు ఎలా తప్పించుకోగలుగుతా'రని అనుకుంటూ బరువుగా అడుగులు వేసి జన సందోహంలో కలిసిపోయాను.

***